## నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

ధైర్యము విడుటెల్ల ధరణిన జూడగా
మరణమునకు సమము మనుషులార
చిక్కులెల్ల వచ్చి యిక్కట్లు పెట్టినా
వాటినెదుకొనిన వసుధమెచ్చు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 351 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 15-04-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00




## బీహార్ సీఎం పదవికి నితీశ్
# రాజీనామా

- కొత్త సీఎంగా బీజేపీకి చెందిన సమ్రాట్ చౌధరీ ఎంపిక
- నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న సమ్రాట్

**పాట్నా**

బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ఎంపికయ్యారు. దాదాపు రెండు దశాబ్దాలు పాటు బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న నితీష్ కుమార్ మంగళవారం రాజీనామా చేశారు. దీంతో బిహార్‌లో అత్యున్నత పదవిని అధిరోహించనున్న తొలి బీజేపీ నేతగా సమ్రాట్ చౌధరీ నిలిచారు. బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటివరకు బిహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న 57 ఏళ్ల సమ్రాట్ ఓబీసీ వర్గమైన కుష్వాహా కులానికి చెందినవారు. బిహార్‌లోని ఓబీసీ కులాలలో యాదవుల తర్వాత కుష్వాహా వర్గమే అతి పెద్దది ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన నితీష్.. కుష్వాహా కులానికి చెందిన వ్యక్తినే తదుపరి సీఎంగా ప్రకటించాలని షరతు విధించినట్టు సమాచారం. నితీష్ సలహా మేరకే బీజేపీ.. సమ్రాట్‌కు సీఎం పీఠం అప్పగించినట్టు తెలుస్తోంది. మధ్యలో కొన్ని సంవత్సరాలు మినహా 2005 నుంచి బీజేపీ, బిహార్ ప్రభుత్వంలో మైనర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. 20 సంవత్సరాల తర్వాత బీజేపీకి చెందిన నేత బిహార్ సీఎం అయ్యారు. 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీలో నితీష్ కుమార్ పార్టీకి 85 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 89 మంది ఉన్నారు. కాగా, బిహార్ కొత్త సీఎం అయిన సమ్రాట్ చౌధరీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి . ఆయన మొదట ఆర్జేడీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు.

-మిగతా 2 లో

## దేశానికి గాంధీ, అంబేడ్కర్
# రెండు కళ్లు

## బలమైన దేశంగా ఎదగడానికి బాబా సాహెబ్ కృషి

- తెలంగాణలో దళితులు అభ్యున్నతికి పెద్దపీట
- దళితబిడ్డలు ఉన్నత పదవుల్లో ఉంటే ఓర్వలేకపోతున్నారు
- ప్రస్తుత డీలిమిటేషన్‌తో తెలంగాణకు తీరని అన్యాయం
- అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,**

:దేశానికి గాంధీ, అంబేడ్కర్ రెండు కళ్లలాంటి వారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ పాత్ర ఎంత ఉందో.. దేశాభివృద్ధిలో అంబేడ్కర్ పాత్ర అంతే ఉందన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఆ ఇదకదరు మహానుభావులు దేశానికి రెండు కళ్లలాంటి వారని అన్నారు. రక్తం చిందకుండా యుద్ధం గెలవచ్చని గాంధీ నిరూపించారు.

-మిగతా 2 లో







## నేడు ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

- ఉదయం 10.31గంటలకు విడుదల
- ఈ విషయాన్ని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడి




**అమరావతి**

ఏపీలో ఇంటర్ ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను బుధవారం ఉదయం 10.31గంటలకు విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఫలితాలను వెబ్‌సైట్లలోనూ పొందొచ్చు. అలాగే, మనమిత్ర ద్వారా వాట్సప్‌లోనూ (9552300009) ఈ ఫలితాలు పొందొచ్చని మంత్రి పేర్కొన్నారు. ఏపీలో ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమైన ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

-మిగతా 2 లో

## మోడీకి ట్రంప్ ఫోన్ కాల్..



2లో



## తమిళనాడు బీజేపీ ఎన్నికల
# మేనిఫెస్టో విడుదల

- మహిళలకు ఉచిత సిలిండర్, నెలకు రూ.2,000
- చిన్న తరహా, కుటీర పరిశ్రమలకు వడ్డీ లేకుండా రూ.50,00,000 వరకు రుణాలు
- రైతులకు అదనంగా రూ.3,000 ఆర్థిక సాయం
- జల్లికట్టులో పాల్గొనే ఎద్దుల్ని పెంచేవారికి ప్రతినెలా రూ.2,000 ఆర్థిక సాయం
- జల్లికట్టులో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం

**న్యూఢిల్లీ**

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ మేనిఫెస్టో విడుదల చేసింది. చెన్నైలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ అగ్రనేత, కేంద్ర మంత్రి జేపీ నద్దా ఈ మేనిఫెస్టో విడుదల చేశారు. మంగళవారం తమిళ నూతన సంవత్సరం కావడం విశేషం. ఈ సందర్భంగా పార్ట మేనిఫెస్టో విడుదల చేయడం మంచి పరిణామం అని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్, బీజేపీ నేతలు కే అన్నామలై, తమిళిసై సౌందరరాజన్ వంటి కీలక నేతలు పాల్గొన్నారు.ఇక, ప్రజలకు అనేక ఉచిత పథకాల్ని బీజేపీ ప్రకటించింది.

-మిగతా 2 లో

## జాతీయ రహదారులపై
# ఓవర్‌లోడ్‌కు చెక్

- ఇకనుంచి భారీగా జరిమానా విధింపు
- నేటినుంచే అమల్లోకి వచ్చిన నిబంధన

2లో



## రిక్షా, ట్యాక్సీ డ్రైవర్లకు
# మరాఠీ రావాల్సిందే..



- మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశం..
- మే 1 నుంచి అమలు

**న్యూఢిల్లీ**

మాతృభాష అమలు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మహారాష్ట్రలో రిక్షాలు, ట్యాక్సీలు నడిపై డ్రైవర్లకు మరాఠీ భాష రావాల్సిందే అంటూ ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ నిర్ణయం మాతృభాషను అమలు చేయాలనే ఆలోచనకన్నా.. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని తీసుకున్నట్లుగా కనిపిస్తోంది.

-మిగతా 2 లో

## దేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య పార్టీ
# కాంగ్రెస్

- రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రజాప్రభుత్వం
- రూ.22,500 కోట్లతో రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం
- అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రతిపక్షాలు
- విపక్షాల తీరుపై మండిపడ్డ భట్టి విక్రమార్క




**ఖమ్మం,**

దేశంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీ కాంగ్రెస్‌లో మనమంతా పని చేయటం అదృష్టమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఈ దేశానికి కాంగ్రెస్ స్వాతంత్ర్యం తెచ్చిందని ఉద్ఘాటించారు. దేశంలో ఏ పార్టీకి ఇంతటి ఘన చరిత్ర లేదని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ బాధ్యతల స్వీకార కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ హాజరయ్యారు. అలాగే, అంబేడ్కర్ 135వ జయంతి

-మిగతా 2 లో



## 543 నుండి 850కి పెరగనున్న
# ఎంపీ స్థానాలు!

- పార్లమెంట్‌లో మహిళలకు 273 సీట్లు ఖాయం?
- ఏప్రిల్ 16 నుంచి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు.
- నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రం ముసాయిదా సిద్ధం.

**న్యూఢిల్లీ**

పార్లమెంట్‌లో లోక్‌సభ సీట్ల పెంపుపై కేంద్రం తాజా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీని ప్రకారం లోక్‌సభ సీట్లు 543 నుంచి 850కి పెంచాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు తగిన డ్రాఫ్ట్ కాపీని రూపొందించిన కేంద్రం పార్లమెంట్‌లోని పార్టీలకు, ఎంపీలకు అందజేసింది. మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో మూడు రోజులపాటు ఈ సమావేశాలు జరుగుతాయి.కేంద్ర ప్రతిపాదనల ప్రకారం.. లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 ఎంపీ సీట్లు 850కి పెరుగుతాయి. ఇందులో రాష్ట్రాల్లో 815 స్థానాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలు పెరిగే అవకాశం ఉంది. ఇదే సమయంలో చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును కూడా

-మిగతా 2 లో

## పదేళ్ల దుర్మార్గ పాలనలో లక్షల దోపిడీ

- కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పి తీరాలి
- కెటిఆర్ పాదయాత్రలు చేసినా ప్రజలు నమ్మరు
- కాంగ్రెస్ కమిటీ బాధ్యత స్వీకారంలో పిసిసి చీఫ్



**ఖమ్మం**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దుర్మార్గమైన పరిపాలన చేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తానంటున్నారని.. ఆయన పాదయాత్ర కాదని.. ఏం చేసినా రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ని క్షమించరని హెచ్చరించారు. కేసీఆర్.. అప్పులు చేసి ఫాంహౌస్‌లో పడుకున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ పాదయాత్రకు ముందు మీ చెల్లి కవిత అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని

-మిగతా 2 లో

## ప్రపంచం ముందు పాక్ పరువు బజారున

- ఇరాన్-అమెరికా చర్చలు జరిగిన హోటల్ బిల్లు కూడా చెల్లించలేని పాకిస్తాన్!
- హోటల్ నోటీసులతో అసలు రంగు బయటపడింది. ట్రంప్ ప్రశంసలు కురిపించిన వేళ..
- అప్పుల ఊబిలో షెహబాజ్ ప్రభుత్వం.

2



## ప్రజలను బంట్రోతుగా చూస్తున్నారా?

- లక్ష్మణ్ వలసపోయరాని విమర్శలా
- ఇందిర,రాహుల్, ప్రియాంక ఎక్కడ పోయారు
- ఉత్తరాది, దక్షిణాది అంటూ విభేదాలు సృష్టిస్తారా
- రేవంత్ వ్యాఖ్యలపై మండిపడ్డ కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి బంట్రోతు పోస్ట్ దొరకదని అంటున్నారని.. ప్రజలను బంట్రోతులుగా చూస్తున్నారా అని ఆగ్రహించారు. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభజన తీసుకొచ్చే విధంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి తప్పుడు మాటలు మాట్లాడొద్దని,

-మిగతా 2 లో



# బీహార్ సీఎం పదవికి నితీశ్ రాజీనామా

మొదటి తరువాయి

ఆ తర్వాత జేడీ (యు)లో చేరారు. ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నాయకుడిగా ఎదిగారు. ఈ రకంగా ఆయనకు బిహార్‌లోని మూడు ప్రధాన పార్టీల్లో పని చేసిన అనుభవం ఉంది. దాదాపు రెండు దశాబ్దాల పాటు బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగిన నితీష్ కుమార్ రాజీనామా చేశారు. పట్నాలో తన చివరి కేబినెట్ సమావేశానికి అధ్యక్షత వహించిన అనంతరం ముఖ్యమంత్రి పదవి నుంచి నితీష్ వైదొలిగారు. దీంతో తమ నాయకుడిని ఎన్నుకోవడానికి ఎన్డీయే శాసనసభ పక్షం సమావేశం అయ్యింది. కేంద్ర పరిశీలకుడిగా నియమితుడైన మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ సమావేశానికి హాజరు అయినట్లు సమాచారం.

## తమిళనాడు బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

మొదటి తరువాయి

సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యం వంటి అంశాల్ని దృష్టిలో పెట్టుకుని ఈ మేనిఫెస్టో రూపొందించినట్లు బీజేపీ నేతలు తెలిపారు. మేనిఫెస్టోలోని కీలక హామీలివి. మహిళలకు ప్రతి నెలా రూ.2,000 ఆర్థికసాయం, ప్రతి కుటుంబానికి ఏటా రూ.10,000 ఆర్థిక సాయం, ఉచిత గ్యాస్ సిలిండర్, జీరో ఎఫ్ఐఆర్ రిపోర్టింగ్ సిస్టమ్ అమలు, క్రూరమైన నేరాల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు, బస్సులు, స్కూళ్లు, యూనివర్సిటీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, అర్హులైన మహిళలు ఈ స్కూటర్లు కొనుక్కునేందుకు రూ.25,000 ఆర్థిక సాయం, స్వయం సహాయక గ్రూపులకు, చిన్న తరహా, కుటీర పరిశ్రమలకు వడ్డీ లేకుండా రూ.50,00,000 వరకు రుణాలు, రైతులకు అదనంగా రూ.3,000 ఆర్థిక సాయం, జల్లికట్టులో పాల్గొనే ఎద్దుల్ని పెంచేవారికి ప్రతినెలా రూ.2,000 ఆర్థిక సాయం, జల్లికట్టులో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం, మహిళల పేరు మీద ఇల్లు కొంటే మూడు శాతం తక్కువ స్టాంప్ డ్యూటీ విధింపు వంటివి ఉన్నాయి. తమిళనాడులో ఈ నెల 23 అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ 234 అసెంబ్లీ సీట్లున్నాయి. 5.67 కోట్ల మంది ఓటర్లున్నారు. 44 ఎస్సీ సీట్లు, 2 ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లు. మే 4న ఫలితాలు వెలువడుతాయి. డీఎంకే, ఏఐఏడీఎంకే, టీవీకే, బీజేపీ, కాంగ్రెస్ ప్రధాన పార్టీలుగా పోటీ చేస్తున్నాయి.

## నేడు ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

మొదటి తరువాయి

మార్చి 23 వరకు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా పరీక్షల నిర్వహణకు నెల సమయం పట్టింది. దీంతో మూల్యాంకనం పూర్తి కావడంలో కొంత ఆలస్యమైనప్పటికీ అనుకున్న సమయానికన్నా ముందే ఫలితాలను విడుదలకు సిద్ధం చేయడం విశేషం. ఏపీ ఇంటర్ ఫలితాలతో పాటు దీనికి సంబంధించిన అప్‌డేట్స్‌ను వెబ్‌సైట్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

## జాతీయ రహదారులపై ఓవర్‌లోడ్‌కు చెక్

**-ఇకనుంచి భారీగా జరిమానా విధింపు**
**-నేటినుంచే అమల్లోకి వచ్చిన నిబంధన**

**న్యూఢిల్లీ**



జాతీయ రహదారులపై ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలకు చెక్ పెట్టేందుకు కేంద్రం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలకు విధించే జరిమానాలను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ సవరించింది. కొత్త నిబంధనలు ఏప్రిల్ 15 నుంచి అంటే నేటినుంచే అమల్లోకి వస్తాయి. దీని ప్రకారం.. వాహనానికి అనుమతించిన బరువు కంటే అదనంగా ఉన్న భారాన్ని బట్టి జరిమానా వసూలు చేస్తారు. ఈ మేరకు నేషనల్ హైవేస్ ఫీ ఫోర్త్ అమెండ్‌మెంట్ రూల్స్, 2026ని మోర్త్ నోట్గి÷ చేసింది. 10 శాతం వరకు ఓవర్‌లోడ్‌కు ఎటువంటి జరిమానా విధించరు. 10 నుంచి 40 శాతం వరకు ఓవర్‌లోడ్‌కు సాధారణ టోల్ రుసుము కంటే 2 రెట్లు అధికంగా రుసుము వసూలు చేస్తారు. 40 శాతం కంటే ఎక్కువ ఓవర్‌లోడ్‌తో వెళితే సాధారణ టోల్ రుసుము కంటే 4 రెట్లు అధికంగా విధిస్తారు. ఓవర్‌లోడ్‌కు విధించే జరిమానాను ఫాస్టాగ్ ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. టోల్‌ఎ÷-లాజా వద్ద బరువు కొలిచే ఏర్పాటు లేకపోతే ఎలాంటి రుసుములూ ఉండవు. రహదారుల భద్రతను పెంపొందించడం, రహదారి మౌలిక సదుపాయాలను రక్షించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

## రిక్షా, ట్యాక్సీ డ్రైవర్లకు మరాఠీ రావాల్సిందే..

మొదటి తరువాయి

మహారాష్ట్రలో మే 1 నుంచి రిక్షాలు, ట్యాక్సీలు నడిపే డ్రైవర్లకు మరాఠీ భాషపై కనీస అవగాహన ఉండాలని రాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్నాయక్ తెలిపారు. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్త కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. రవాణా శాఖ దీనిపై స్పెషల్ డ్రైవ్ చేపడుతుందని, ఈ మేరకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కనీస మరాఠీ భాష మాట్లాడటం, అర్థం చేసుకోవడం రాని డ్రైవర్ల లైసెన్సులు రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. "మే 1న మహారాష్ట్ర దినోత్సవం. ఆ రోజు నుంచి రాష్ట్రంలో లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు మరాఠీ తెలిసి ఉండాలి. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపడతాం. 59 ప్రాంతీయ, ఉప ప్రాంతీయ కార్యాలయ పరిధిలో రవాణా శాఖ ఆధ్వర్యంలో డ్రైవర్లు టెస్టులు పాసవ్వాలి. మరాఠీ రాయడం, చదవడం వచ్చి ఉండాలి" అని మంత్రి ప్రతాప్ సర్నాయక్ అన్నారు. డ్రైవర్లతో కమ్యూనికేషన్ సందర్భంగా ప్రయాణికుల నుంచి వచ్చిన వేలాది ఫిర్యాదుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ముంబై మెట్రోపాలిటన్ పరిధిలో ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రాంతీయ భాష నేర్చుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్న వారు ఆ ప్రాంతపు భాష నేర్చుకోవాలని మంత్రి సూచించారు. ప్రతి ఒక్కరూ తమ మాతృభాషపై గర్వపడాలని అభిప్రాయపడ్డారు.

## 543 నుండి 850కి పెరగనున్న ఎంపీ స్థానాలు!

మొదటి తరువాయి

పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. ప్రస్తుతం నారి శక్తి వందన్ అభినియం పేరుతో ఈ బిల్లును ప్రవేశపెట్టబోతుంది కేంద్రం. 2011 జనాభా లెక్కలకు అనుగుణంగా ప్రస్తుతానికి మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తారు. దీని ప్రకారం మహిళలకు పార్లమెంట్‌లో 273 సీట్లు వచ్చే అవకాశం ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లును, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును త్వరలోనే పార్లమెంట్‌లో ఆమోదింపజేయాలని కేంద్రం లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఈ రెండింటిని 2029 లోక్‌సభ ఎన్నికల్లో అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ఒక కమిటీని నిర్ణయిస్తుంది. ఈ కమిటీయే మహిళలకు సీట్లు కేటాయిస్తుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలైతే పార్లమెంట్‌తోపాటు రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ మహిళలకు సీట్లు పెరుగుతాయి. ఈ బిల్లులు అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 55, ఆర్టికల్ 81లను సవరించాలి. ఇది 131వ రాజ్యాంగ సవరణ అవుతుంది.

# దేశానికి గాంధీ, అంబేద్కర్ రెండు కళ్లు

మొదటి తరువాయి

బలమైన దేశంగా భారత్ ఎదగడానికి అంబేద్కర్ కృషి చేశారు. ప్రజల కలలు సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అలాగే తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్రను ఎవరూ మర్చిపోలేరని సీఎం తెలిపారు. గత ప్రభుత్వ కేబినెట్‌లో దళితులకు ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ కేబినెట్‌లో దళితులకు ప్రాధాన్యం ఇచ్చామ న్నారు. దళిత బిడ్డ బడ్జెట్ ప్రవేశపెడితే చూడలేకపోతున్నారంటూ విమర్శించారు. గతంలో భట్టి విక్రమార్కకు సీఎల్పీ నేత హోదాను తొలగించేలా కుట్రలు జరిగాయని సీఎం రేవంత్ ఆరోపించారు. ఎస్సీ నాయకుడు స్పీకర్‌గా, ఆర్థిక మంత్రిగా ఉండకూడదా అని ప్రశ్నించారు. గత పదేళ్లలో ఎనాడైనా డైట్ ఛార్జీలు పెంచారా అని నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కడితే ఓర్వలేక పోతున్నారంటూ వ్యాఖ్యానించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానంతో పిల్లల భవిష్యత్తు మారుతుందని
తెలిపారు. ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక 67వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామన్నారు. 67వేల ఉద్యోగాల్లో 87శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే వచ్చాయని వెల్లడించారు. పదేళ్ల విధ్వంసం.. వందేళ్ల



నష్టానికి దారి తీసిందని సీఎం వ్యాఖ్యానించారు. ఆనాడు చేసిన అప్పులు చెల్లిస్తూ.. తప్పులు సరిదిద్దుతూ పాలన కొనసాగిస్తున్నామని వివరించారు. మహిళా రిజర్వేషన్లు, సీట్ల పెంపుపై కేంద్రం గందరగోళం సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 50 శాతం జనాభా ఆధారంగా.. మరో 50 శాతం జీఎస్‌డీపీ ఆధారంగా హైబ్రిడ్ మోడల్‌లో డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాజ్యసభలో ఆమోదం లభించిందని.. కానీ లోక్‌సభలో కొన్ని పార్టీలు అడ్డుకున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. సమాన అవకాశాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడపవచ్చని అంబేద్కర్ మార్గదర్శనం చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

పేదలకు నాణ్యమైన విద్య కోసం గతంలో లేని విధంగా చర్యలు చేపట్టాం. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానంతో పిల్లల భవిష్యత్ మారుతుంది. తెలంగాణ ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. గతంలో చేసిన అప్పులు, తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నాం. పదేళ్ల విధ్వంసం.. వందేళ్ల నష్టానికి దారి తీసిందని సీఎం అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును లోక్‌సభలో కొన్ని పార్టీలు అడ్డుకున్నాయి. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. దక్షిణాదిన కుటుంబ నియంత్రణ వల్ల జనాభా తగ్గి సీట్లు కోల్పోయే పరిస్థితి. కేంద్రం ఆదేశాలు పాటించి జనాభా నియంత్రణ పాటిస్తే నష్టం చేస్తున్నారు. తెలంగాణకు తీరని నష్టంపై అభ్యంతరం లేవనెత్తాం అని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# మోడీకి ట్రంప్ ఫోన్ కాల్..

**-హర్మ్యూజ్ జలసంధి,**
**ద్వైపాక్షిక సంబంధాలపై సంభాషణ..!**

**న్యూఢిల్లీ**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను నిలువరించేందుకు మధ్యవర్తిత్వం వహించి పాకిస్థాన్ విఫలమైన వేళ.. భారత ప్రధాని నరేంద్ర మోడీ , అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఫోన్‌లో నలభై నిమిషాల పాటు సంభాషించుకున్న ఇరువురు హర్మ్యూజ్ జలసంధి, ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం గురించి చర్చించుకున్నారు. ట్రంప్ తనకు ఫోన్ చేశారని, ఇద్దరి మధ్య ద్వైపాక్షిక అంశాలు ప్రస్తావనకు వచ్చాయని మంగళవారం ఎక్స్ వేదికగా మోడీ పంచుకున్నారు.ఇరాన్, అమెరికా మధ్య రెండో



దఫా చర్చల వార్తలు ఊపందుకున్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోడీతో డొనాల్డ్ ట్రంప్ ఫోన్‌లో మాట్లాడడం ప్రాధాన్యం సంతరించుకుంది. హర్మ్యూజ్ జలసంధి సంరక్షణ, ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై మోడీ, ట్రంప్ చర్చించుకున్నారు.నా స్నేహితుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఫోన్ వచ్చింది. భారత్ అమెరికా మధ్య వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారం గురించి ఇద్దరం మాట్లాడుకున్నాం. భవిష్యత్‌లో అన్ని విభాగాల్లో ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి ఇద్దరం కట్టుబడి ఉన్నాం. పశ్చిమాసియాలోని పరిస్థితులపై, హర్మ్యూజ్ జలసంధిని తెరిచి ఉంచడం, సురక్షితంగా ఉంచడం ఎంత ముఖ్యమో కూడా చర్చించాం' అని మోడీ ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# దేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య పార్టీ కాంగ్రెస్

మొదటి తరువాయి

సందర్భంగా ఖమ్మం నగరంలోని జడ్పీ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి భట్టి విక్రమార్క, మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా కాంగ్రెస్ కార్యాయలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. నేడు దేశాన్ని ఏలుతున్న బీజేపీ కూడా కాంగ్రెస్ తర్వాతే వచ్చిందని భట్టి విక్రమార్క ప్రస్తావించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తోంటే రైతులకు ఆ మేలు జరగకూడదని ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రూ.22,500 కోట్లతో రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం చేపట్టామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆగ్రహించారు.పేదలకు ఇళ్లు దక్కకూడదనే లక్ష్యంతో ప్రతిపక్షాల నేతలు దుర్మార్గమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ బలోపేతానికి అందరం ఐక్యంగా కృషిచేద్దామని భట్టి విక్రమార్క సూచించారు. మహిళలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని వెల్లడించారు. కాంగ్రెస్‌పై ప్రతిపక్షాల నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత పదేళ్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీని కాపాడుకునేందుకు ప్రాణాలు పణంగా పెట్టి పోరాడారని ప్రశంసించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేద్దామని సూచించారు. పార్టీకోసం కష్టపడిన వాళ్లకి తప్పకుండా గుర్తింపు దక్కుతుందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# పదేళ్ల దుర్మార్గ పాలనలో లక్షల దోపిడీ

మొదటి తరువాయి

సవాల్ విసిరారు. ఈ మేరకు మాజీ మంత్రి కేటీఆర్‌పై మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్ల కేసీఆర్ హయాంలో ఏం చేశారని.. ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క లెక్కలతో సమాధానాలు అడుగుతుంటే కేసీఆర్ అండ్ కో సతమతమవు తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేత సంతోశ్‌రావు ఎలా సంతోషంగా ఉన్నారో.. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆనందం ఏంటో మీ దోపిడీ ఎంతో.. మీ చెల్లెలు కవిత చెబుతోందని సెటైర్లు గుప్పించారు. పదేళ్లు దోపిడీకి అలవాటు పడి నేడు పదవులు కోల్పోయి ప్రజల ఆగ్రహానికి గురై నేడు విలవిలలాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ అండ్ కో పిచ్చిమాటలు మాట్లాడుతూ అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ బాధ్యతల స్వీకారం కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రపంచంలోనే ఎక్కడ లేని విధంగా ఈ దేశంలో ప్రధాన పాత్ర పోషిస్తోందని చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లా.. కాంగ్రెస్‌కి ఎప్పుడూ అండగా నిలిచిందని ఉద్ఘాటించారు. బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్న పీవీ నరసింహా రావు దేశ ప్రధాని అయ్యారని ప్రస్తావించారు. ఇది ఒక్క కాంగ్రెస్‌కే సాధ్యమని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాలని మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతో నేడు తెలంగాణలో అధికారంలోకి వచ్చామని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని సమూలంగా వారికి నచ్చినట్లుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తుంటే.. కాంగ్రెస్ అడ్డుకుందని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాట ఫలితంగా కులగణన చేశారని ప్రస్తావించారు. కాంగ్రెస్‌లో సామాన్య కార్యకర్తలు కీలక పదవులు పొందారని అన్నారు. భట్టివిక్రమార్క చేసిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందని ఉద్ఘాటించారు. ఖమ్మం గడ్డపై నిలబడి చెబుతున్నా.. వచ్చే ఎన్నిక కాదని.. ఆ తర్వాత వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. చేతనైతే తమ విజయాన్ని అడ్డుకోవాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తాము నెరవేరుస్తున్నామని తెలిపారు. ఖమ్మం నుంచే కాంగ్రెస్ విజయం ప్రారంభమైందని చెప్పుకొచ్చారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ప్రపంచం ముందు పాక్ పరువు బజారున

**-ఇరాన్-అమెరికా చర్చలు జరిగిన హోటల్ బిల్లు కూడా చెల్లించలేని పాకిస్తాన్!**
**-హోటల్ నోటీసులతో అసలు రంగు బయటపడింది.**
**-ట్రంప్ ప్రశంసలు కురిపించిన వేళ.. అప్పుల ఊబిలో షెహబాజ్ ప్రభుత్వం.**

**న్యూఢిల్లీ**



ఇరాన్-అమెరికా మధ్య శాంతి చర్చలకు వేదికగా నిలిచి, ప్రపంచం ముందు గొప్పలు పోతున్న పాకిస్తాన్ అసలు వ్యవహారం ఇప్పుడు బయటపడింది. రెండు దేశాల మధ్య చర్చలకు వేదికైన ఇస్లామాబాద్‌లోని హోటల్ బిల్లు కూడా చెల్లించలేక ప్రపంచం ముందు అవమానం పాలైంది. ఇరాన్-అమెరికా మధ్య పాకిస్తాన్ వేదికగా ఇటీవల శాంతి చర్చలు జరిగాయి. ఏప్రిల్ 10-12 వరకు ఇస్లామాబాద్‌లోని హోటల్ సెరెనా వేదికగా శాంతి చర్చలు జరిగాయి.దీనికి ఇరు దేశాలకు చెందిన అగ్రనేతలు హాజరయ్యారు. వీరికి పాక్ ప్రభుత్వం ఆతిథ్యం ఇచ్చింది. అంటే, ఇక్కడి ఆతిథ్య ఖర్చుల్ని పాక్ భరించాలి. ఇక.. ఈ చర్చలు విఫలమైన సంగతి కూడా తెలిసిందే. ఈ చర్చలు నిర్వహించడం ద్వారా ప్రపంచం ముందు తాము ఈ ప్రాంతంలో మధ్యవర్తిత్వం వహించగల సత్తా ఉన్న దేశంగా చాటింపు చేసుకుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా పాకిస్తాన్‌ను పొగిడాడు. పాక్ ప్రధాని షెహబాజ్, సైన్యాధ్యక్షుడు అసిమ్ మునీర్‌పై ప్రశంసలు కురిపించారు. ఇంతఖ్యాతి పొందిన పాకిస్తాన్ ఇప్పుడు ఇదే విషయంలో ప్రపంచం ముందు అభాసుపాలైంది.

# ప్రజలను బంట్రోతుగా చూస్తున్నారా?

మొదటి తరువాయి

వాస్తవాలు మాట్లాడాలని సూచించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు. రేవంత్ రెడ్డి వితండవాదలు పక్కన పెట్టాలని కిషన్ రెడ్డి హితవు పలికారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ వ్యతిరేకంగా పుట్టిన పార్టీ టీడీపీ అని తెలిపారు. తెలుగువారి ఆత్మగౌరవంగా టీడీపీ పుట్టిందని ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఇద్దరు ఉపరాష్ట్రపతులుగా ఉన్నారని ప్రస్తావించారు. వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా పని చేశారని, తాను ఒక్కడినే మేధావిని అనుకుని అద్దాల మేడలో కూర్చుని సీఎం రేవంత్ రెడ్డి రాళ్లు వేయడం మంచిది కాదని హితవు పలికారు. ఇందిరా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు. దేశం మొత్తం ఒకటి కాదా అని ప్రశ్నించారు. లక్ష్మణ్ వలస పోయారని రేవంత్ రెడ్డి అంటున్నారని.. మరి ఇందిరాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ ఎక్కడి నుంచి పోటీ చేశారని కిషన్ రెడ్డి నిలదీశారు. కాంగ్రెస్‌ను రాహుల్ గాంధీ బుద్ధితో నడిపిస్తే, రేవంత్ రెడ్డి డబ్బులతో నడిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కి అధికారికంగా కోశాధికారిగా పని చేస్తున్నారని సెటైర్లు గుప్పించారు. డీలిమిటేషన్‌తో ఎన్ని సీట్లు పెరుగుతాయనేది పార్లమెంట్ సమావేశాల్లో తెలుస్తోందని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి హైబ్రిడ్, జీడీపీ పరంగా సీట్లు పెరగాలని అంటున్నారని, ప్రపంచలో ఇది ఎక్కడ లేదని అన్నారు.

# మొండి గౌరెల్లిలో ఘనంగా అంబేద్కర్ జయంతి



**ఇబ్రహీంపట్నం,ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
యాచారం మండలం మొండి గౌరెల్లి గ్రామంలో సర్పంచ్ కోలన్ రమాదేవి మల్లారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అంబేద్కర్ పేద కుటుంబంలో పుట్టి ఎన్నో అవమానాలను ఎదుర్కొంటూ స్వయంకృషితో ఎదిగి, విదేశాల్లో విద్యాభ్యాసం పూర్తి చేసి జాతి గర్వించే స్థాయికి చేరారని కొనియాడారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ బడే కుమార్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గ్రామ యువత, సిబ్బంది పాల్గొన్నారు.

# అందరికీ ఆదర్శం అంబేద్కర్ జీవితం

-- కొంగర విష్ణువర్ధన్ రెడ్డి



**మంచాల, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మంచాల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వింజమూరి రాంరెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, అంబేద్కర్ బడుగు--బలహీన వర్గాల సంక్షేమం కోసం పోరాడిన యోధుడని, ఆయన జీవితం అందరికీ ఆదర్శమని అన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బైరిక రమాకాంత్ రెడ్డి, చీమల జంగయ్య యాదవ్, ఎడమ నరేందర్ రెడ్డి, అనంగల్ల యాదయ్య, పల్లాటి జయానందం, గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెదిరే సికిందర్ రెడ్డితో పాటు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనలో కృషి చేస్తాం



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఇబ్రహీంపట్నం కేంద్రంలో ఘనంగా వేడుకలు జరిగాయి.ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే(ఎచ్-143) నియోజకవర్గ అధ్యక్షుడు సూరమోని సత్యనారాయణ మాట్లాడుతూ, అంబేద్కర్ సామాజిక న్యాయం, సమాన హక్కుల కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మొలుగు శ్రీనివాస్, జిల్లా నాయకులు చెరుకూరి మహేందర్, ఆముదల సందీప్, పి. సుదర్శన్, చెరుకూరి మల్లేష్, సూరమోని బాబు, సాగర్ హనుమంత్, చెనమోని గోపాల్, నరేందర్, మహేష్ చారి, సురేష్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

---



మిర్యాలగూడలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి- బీఆర్ఎస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

# తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**హైదరాబాద్, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి దూగంట్ల నరేష్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు రాము యాదవ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామిడి వెంకట్ రెడ్డి, మహిళా విభాగం నాయకురాళ్లతో కలిసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు.వక్తలు మాట్లాడుతూ, అంబేద్కర్ కుల నిర్మూలన, సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన కృషి చిరస్మరణీయమని, యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# గొల్లపల్లి రిజర్వాయర్ ఆపకపోతే ఉద్యమం తప్పదు

గోళి శ్రీనివాస్ రెడ్డి



**కల్వకుర్తి, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గొల్లపల్లి రిజర్వాయర్ ప్రాజెక్ట్ ఆపకపోతే మరో ఉద్యమం తప్పదని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు.ఈ రిజర్వాయర్ వల్ల కల్వకుర్తి చివరి ఆయకట్టు ప్రాంతం అన్యాయం ఎదుర్కొంటుందని ఆయన అన్నారు. 2001లో ఆనాటి ప్రభుత్వం 2.5 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని చెప్పి కేవలం 50 వేల ఎకరాలకు పరిమితం చేసిందని గుర్తుచేశారు.తెలంగాణ ఆవిర్భావం తరువాత కెసిఆర్ నేతృత్వంలో పెద్ద రిజర్వాయర్లు నిర్మాణానికి సర్వేలు జరిగాయని, రైతుల భూములకు విలువ పెరగడంతో వాయిదా వేశారని వివరించారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ పేరిట డబ్బులు దండుకోవాలని చూస్తోందని ఆరోపిస్తూ, ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాలు చేసి రైతాంగాన్ని కాపాడతామని స్పష్టం చేశారు.




కల్వకుర్తి మండలం లింగసానిపల్లి గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి కార్యక్రమం బీఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.

# రాష్ట్ర స్థాయి ర్యాంకర్ మౌనికకు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అభినందనలు

-కష్టపడి చదివితే ప్రభుత్వ విద్యాసంస్థల నుంచే గొప్ప విజయాలు సాధ్యం: ఎమ్మెల్యే



**జడ్చర్ల, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని మౌనికను జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి సన్మానించి అభినందించారు.
ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 440లో 438 మార్కులు సాధించి స్టేట్ ర్యాంకర్‌గా నిలిచిన మౌనిక, జడ్చర్ల మున్సిపాలిటీలోని కావేరమ్మపేట మైనార్టీ గురుకుల కళాశాలలో విద్యను అభ్యసించడం గర్వకారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు

# అక్షర యోధునికి బుజ్జి వారసుల నీరాజనం



**షాద్‌నగర్, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలో చిన్నారులు చూపిన వినూత్న నివాళి ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది.ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్న తొమ్మిదో తరగతి విద్యార్థులు, విగ్రహం వద్ద పేరుకుపోయిన ధూళిని తమ చేతులతో నీళ్లు పోసి శుభ్రం చేశారు.తమ జేబు ఖర్చుల నుంచి రూపాయి రూపాయి పొదుపు చేసి కొనుగోలు చేసిన పూలదండను మహనీయుని విగ్రహానికి సమర్పించారు.“అక్షరమే ఆయుధం” అని నమ్మిన అంబేద్కర్‌కు చదువుకుంటున్న ఈ చిన్నారులు ఇచ్చిన నివాళి కంటే గొప్ప పుట్టినరోజు కానుక ఏముంటుంది? షాద్‌నగర్ సాక్షిగా సామాజిక చైతన్యానికి ఈ విద్యార్థులు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు.

# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**మర్రిగూడ, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.పోలీస్ స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామపంచాయతీ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాల్లో అంబేద్కర్ ఫోటోలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన రాజ్యాంగ నిర్మాణంలో చేసిన కృషి వెలకట్టలేనిదని వక్తలు కొనియాడారు.జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీరమల్ల శిరీష, లోకేష్ గౌడ్, మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య గౌడ్, మహేశ్వరం సతీష్, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# యరగండ్లపల్లిలో చలివేంద్రం ఏర్పాటు



**మర్రిగూడ, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వేసవి ఎండల్లో ప్రజల దాహార్తి నివారణార్థం యరగండ్లపల్లి గ్రామంలో సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ప్రజా సేవలో ఎప్పుడూ ముందుండే సర్పంచ్, బాటసారులు--గ్రామస్థుల సౌకర్యార్థం ఈ చలివేంద్రాన్ని ప్రారంభించగా, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొని సర్పంచ్ దాతృత్వాన్ని ప్రశంసించారు.

# చిన్న తూప్రాలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**మహేశ్వరం,ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహేశ్వరం మండలంలోని చిన్న తూప్రా గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ఏఐసీసీ సభ్యుడు చల్లా వంశీచందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యం వహించారు.వేడుకల్లో ఎమ్మెల్యే శంకరయ్య, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనిత రెడ్డి, మాజీ మేయర్ పారిజాత నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణా నాయక్, స్థానిక సర్పంచ్ గొల్లూరి రాజుతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



మంచాల మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు నూకం రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించడం జరిగింది.



తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామంలో ఘనంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు.




ఇర్విన్ గ్రామంలో ఘనంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు

## చేర్యాకర్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు





**వెల్దండ, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చేర్యాకర్ గ్రామంలో సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్ మున్సిపల్ కౌన్సిలర్ పాపిశెట్టి రామకృష్ణ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.సర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ, అంబేద్కర్ అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పోరాడిన మహానుభావుడని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, మాజీ ఎంపిటిసి భీమయ్య గౌడ్, ఉప సర్పంచ్ కొండలు, బిఆర్ఎస్ నాయకులు, యువజన సంఘం సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



బోడుప్పల్ మహాజన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు.



జవహర్ నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి జయంతి వేడుకలు.

# మనిషి జీవితంలో మార్పు తెచ్చిన మహోన్నత వ్యక్తి డా, బీఆర్ అంబేద్కర్





**-చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యం**
**-డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ రాజ్యాంగాన్ని రచించి ప్రపంచ ఖ్యాతి పొందారు**
**-జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్...**

**సూర్యాపేట,ఏప్రిల్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్):** బడుగు, బలహీన వర్గాల వారికి రాజ్యాంగాన్ని నిర్మించి మనిషి జీవితంలో మార్పు తెచ్చిన మహోన్నత వ్యక్తి డా, బీఆర్ అంబేద్కర్ అని చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యం అని నిరూపించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు రుణపడి ఉంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం డాక్టర్,, బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఖమ్మం క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన జయంతి ఉత్సవాలకు అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఖమ్మం క్రాస్ రోడ్ కూడలిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సభా వేదికపై ఏర్పాటు చేసిన డా, బీఆర్ అంబేద్కర్ ఫోటోకు పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి మున్సిపల్ చైర్మన్, అడిషనల్ ఎస్పీ తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలుపుతున్నానని ఈ ఉత్సవాలు ఇంత ఘనంగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. డాక్టర్,, బి.ఆర్ అంబేద్కర్ విద్యాభ్యాసం నుండి కుల వివక్షత ఎదుర్కొన్నారని, అలాంటి వివక్షతను తొలగించాలన్న ఆలోచనతో చాలా మార్పులు వచ్చాయని తెలిపారు. ప్రజా సంక్షేమం, ప్రజా అభివృద్ధికి హక్కులు కల్పించే లక్ష్యంతో బడుగు బలహీన వర్గాల వారికి సమాన హక్కులు సాధించాలన్న ద్వేయంతో రాజ్యాంగాన్ని నిర్మించిన అంబేద్కర్ కు మనము ఋణపడి ఉంటామని ఉద్భోధించారు. ప్రపంచంలో ఉన్న గొప్ప చదువులు చదువుకొని న్యాయ, ఆర్థిక, సామాజిక, సాంఘిక వంటి అనేక శాస్త్రలు చదివారని, లండన్ లో ఎకనామిక్స్ చదివి ఆర్థిక వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చారని గుర్తు చేసుకున్నారు. రాజ్యాంగం ద్వారా ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించి సరైన ప్రజా ప్రతినిధిని ఎన్నుకునే హక్కు కల్పించారని, అంతేకాకుండా అందరికి సమానంగా మానవహక్కులు కల్పించారని అన్నారు. సామాజిక, ఆర్థిక సమానత్వం రావడానికి మనమందరం ఇంకా కృషి చేయాలని, హక్కుల కోసం అందరూ బాధ్యత వహించాలని, విద్య ఆరోగ్యం గురించి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. వెనుకబడిన, బడుగు, బలహీన, వెనుకబడిన, మైనార్టీల వర్గాల కోసం తెలంగాణ ప్రభుత్వం సూర్యాపేట జిల్లాలో 3 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టిందని, తొండ, చిలుకూరు, గడ్డిపల్లి లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం ఒక్కొక్క స్కూల్ కు రూ. 200 కోట్ల ఖర్చు చేస్తుందని వివరించారు. అదే విధంగా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు అత్యాధునిక సదుపాయాలతో వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ కె .నరసింహ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావి అని, గొప్ప మహనీయుడు, అని కొనియాడారు. బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలతో పాటు స్త్రీలకు కూడ అనేక హక్కులు కల్పించారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వారానే ఈ స్థానంలో ఉన్నానని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత మాట్లాడుతూ బడుగు, బలహీన, అణగారిన వర్గాల వారి కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎనలేని కృషి చేశారని మహిళా రిజర్వేషన్లు, మహిళలు చదువుకోవడానికి కూడా అనేక అవకాశం కల్పించారన్నారు.

అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాచరచన, ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు జిల్లా కలెక్టర్, ఎస్పీ బహుమతులు అందజేశారు. తదుపరి ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక (99) రోజుల కార్యక్రమంలో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా అరైవ్ – అలైవ్ రోడ్డు భద్రత గురించి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా రవాణా అధికారి రోడ్డు భద్రతపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించి తదుపరి ఫ్లెక్సీలు, చార్టులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ఆర్టీవో జయప్రకాశ్ రెడ్డి, ఎస్సీ సంక్షేమ అధికారి కొల్లి లత, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, వైస్ చైర్మన్ షఫీఉద్దీన్, జిల్లా అధికారులు, సూర్యాపేట తాసిల్దార్ కృష్ణయ్య, ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డిసిసి జిల్లా ప్రెసిడెంట్ గుడిపూడి నరసయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, సీనియర్ జర్నలిస్ట్, గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ కృష్ణ బంటు, నాయకులు , చింతలపాటి చిన్న శ్రీరాములు, జీడి బిక్షం, ఎర్ర వీరస్వామి, ములకలపల్లి రాములు, డాక్టర్ రామ్మూర్తి, పల్లెటి లక్ష్మణ్, టిఎన్జీవోస్ సెక్రటరీ దున్న శ్యామ్, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు వివిధ సంఘాల నాయకులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ యువతకు ఉచిత శిక్షణలు అభినందనీయం

-- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి




**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యాచారం మండలం కురుమిద్ద గ్రామంలోని యంబి కర్మెల్ ప్రార్థనా మందిరంలో గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా జరిగిన సర్టిఫికెట్‌ల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొని అభ్యర్థులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, గ్రామీణ యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం ఇలాంటి శిక్షణలు కీలకమని, పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్, కంప్యూటర్ పరిజ్ఞానం ఉద్యోగ అవకాశాలకు దోహదం చేస్తుందని తెలిపారు. ప్రతి గ్రామంలో ఇలాంటి శిక్షణ కేంద్రాలు ఏర్పడాలని ఆకాంక్షిస్తూ, ప్రభుత్వ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, సర్పంచ్ నీలం శ్రీవిద్య శ్రీరాములు, ఏసిపి కేవీపీ రాజు, పాస్టర్లు, సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**యాచారం, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అయ్యవారిగూడెం గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.సంఘం నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. వక్తలు మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన చేసిన కృషి అపారమని, సామాజిక న్యాయం, సమాన హక్కుల కోసం ఆయన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు.కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొప్పు వెంకటస్వామి, సర్పంచ్ నక్క అలివేలు వెంకటేష్, ఉపసర్పంచ్ కిషన్ నాయక్, పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ, స్థానిక నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## కురవిలో ఘనంగా అంబేద్కర్ జయంతి



**కురవి, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లెల్ల గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ రెంటాల కృష్ణ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు అపారమని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు, మహిళలు, యువజన సంఘాల నాయకులు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# ఎలిగేడులో ఘనంగా అంబేద్కర్ జయంతి


ఎలిగేడులో అంబేద్కర్ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పిస్తున్న అధికారులు ప్రజాప్రతినిధులు


నారాయణ పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో పూలమాల వేస్తున్న సర్పంచ్ రంగు లతా శ్రీనివాస్ గౌడ్


ఎలిగేడు లో మాజీ జెడ్పి వైస్ చైర్ పర్సన్ మండిగ రేణుక రాజనర్సయ్య


ర్యాకల్ దేవ్ పల్లి సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్


రాములపల్లి గ్రామపంచాయతీలో సిద్ది తిరుపతి యాదవ్

**ఎలిగేడు, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. వక్తలు అంబేద్కర్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సై మధుకర్ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు.కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లెర్ల వెంకటేశ్ గౌడ్, తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో బాస్కర్రావు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు దుగ్గాల సంతోష్ రావు, మండల అధ్యక్షుడు సామరాజేశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు బైరెడ్డి రామిరెడ్డి, బీజేపీ సభ్యుడు నల్ల మనోహర్ రెడ్డి, వార్డు సభ్యులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం

-మంత్రి కోమటిరెడ్డి



**నల్లగొండ, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ పట్టణంలోని మర్రిగూడ బైపాస్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రోమో రన్ విజయవంతం చేయాలని పిలుపు



**నల్లగొండ, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మే 3న నల్లగొండలో జరగనున్న "నల్లగొండ ప్రోమో రన్" విజయవంతం చేయాలని సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్ జనరల్ సెక్రటరీ మగ్గరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.రన్నింగ్, ఫిట్నెస్ ప్రాధాన్యతను ప్రజల్లో విస్తరించేందుకు, జూన్ 7న హైదరాబాద్ నెక్లెస్ రోడ్ వద్ద జరగనున్న తెలంగాణ రన్ 2026 భాగంగా రాష్ట్రంలోని పలు నగరాల్లో ఇలాంటి ప్రోమో రన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు.నల్లగొండ వాకర్స్ అసోసియేషన్ కమ్యూనిటీ పార్ట్నర్‌గా భాగస్వామ్యం కావడం ఆనందకరమని, మరింత మంది రన్నర్స్, ఫిట్నెస్ ప్రేమికులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.పాల్గొనదలచిన వారు ఏప్రిల్ 25లోపు గూగుల్ ఫామ్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారు ప్రసాద్, డాక్టర్ పుల్లా రావు, బీమార్జున్ రెడ్డి, కట్టా వెంకటరెడ్డి, శంభు, పవన్, భావన శ్రీనివాస్ రావు, కీసరి శ్రీనివాస రెడ్డి, భజరంగ్, నల్లగొండ అథ్లెట్లు, డీఎస్పీ శివరాం రెడ్డి, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**వెల్దండ, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు నిరుద్యోగ యువత కోసం అంబేద్కర్ భవన సముదాయంలో కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేయగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబేద్కర్ సేవలు అమోఘమని, ఆయన ఆశయాలు సమాజ అభివృద్ధికి మార్గదర్శకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ మట్ట యాదమ్మ, మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, ఉప సర్పంచ్ ఎర్ర శీను, నాయకులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరి కిషన్ నాయక్, యువజన సంఘం అధ్యక్షుడు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో కల్వకుర్తి మున్సిపల్ అభివృద్ధి



**కల్వకుర్తి, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపాలిటీ 22వ వార్డులో సీసీ రోడ్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మున్సిపాలిటీలోని అన్ని వార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రతినిధి చీమ్ముల శ్రీకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్, పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, మహిళా సంఘ నాయకురాలు రేహానా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


లింగాలలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేసిన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

## కల్వకుర్తిలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు



**కల్వకుర్తి, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలో సీఐటీయూ, కెవిపిఎస్, యుటిఎఫ్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా "రాజ్యాంగ పరిరక్షణ -- సవాళ్లు" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు.యుటిఎఫ్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సెమినార్‌లో వక్తలు మాట్లాడుతూ, అంబేద్కర్ కులరహిత సమాజం, లింగ సమానత్వం, మతసామరస్యం, స్త్రీలకు ఆస్తి హక్కులు, సమాన పనికి సమాన వేతనం వంటి అంశాలపై పోరాడిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఇచ్చిన "చదువుకో, సమీకరించు, పోరాడు" అనే సందేశం నేటికీ ప్రజలకు మార్గదర్శకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి. ఆంజనేయులు, కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి పరశురాములు, ఎడిటర్ కె. వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ నాయకులు, అంబేద్కర్ జాతర కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన ఎస్ఐఆర్ మ్యాపింగ్ కార్యక్రమం



**కరీంనగర్, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ గణేష్ నగర్‌లోని ఒడిసి స్కూల్లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజకుమార్, బిఎల్ఓ జ్యోతి, బిఎల్ఓ శంకరమ్మ పాల్గొన్నారు. స్థానిక 57వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ, శ్రీనివాస్‌తో పాటు డివిజన్ ప్రజలు కూడా హాజరయ్యారు.ప్రజల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.


వెల్దండ ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు.

## పిల్లలకు మంచి భవిష్యత్తే లక్ష్యం

చైతన్య స్కూల్



**వెల్దండ, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాఘయిపల్లి చైతన్య హై స్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. చిన్నారులు ఆధునిక, జానపద, సాంస్కృతిక నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మట్ట దశరథం గౌడ్ మాట్లాడుతూ, పిల్లలకు మంచి భవిష్యత్తు అందించడమే పాఠశాల లక్ష్యమని, నిష్ణాత ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థులకు మంచి నడవడిక, విలువలు నేర్పిస్తున్నామని తెలిపారు.జిల్లా, రాష్ట్ర స్థాయిలో తిరుగులేని ఫలితాలతో పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ, ప్రేమ, బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.


కొండ మల్లేపల్లి


దేవరకొండ పట్టణంలో మాలమహానాడు ఆధ్వర్యంలో


అంబేద్కర్ జయంతి సందర్భంగా సర్పంచ్ వర్కాల బాల నారాయణ కు సన్మానం


నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లి గ్రామం పంచాయతీ కార్యాలయం


దేవరకొండ పట్టణం లో స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

# మహోన్నత వ్యక్తి అంబేద్కర్

**- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్**
**- ఆయన ముందు చూపు వల్లే తెలంగాణ**

**ఆమనగల్లు, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అంబేద్కర్ గొప్ప ఆదర్శనీయుడని, ఆయన ముందు చూపు వల్లే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేష్ అధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత అంబేద్కర్ నూతన విగ్రహానికి స్థల



పరిశీలన చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు అనుకూలంగా రాజ్యాంగంలో ఆర్టికల్ 3ని ప్రవేశపెట్టారన్నారు. అందుకే కేసీఆర్ రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టారన్నారు. ప్రపంచంలోనే ఎత్తయిన కాంస్య విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేశారన్నారు. దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన మహానాయకుడు అంబేద్కర్ అన్నారు. కార్యక్రమంలో ఛైర్మెన్ పత్యనాయక్, కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, ఏనుముల రమేష్, నాగిళ్ళ జగన్, దుడ్డు ఆంజనేయులు యాదవ్, అనూష శ్రీశైలం, ఎంగలి భాగ్యమ్మ రఘు, మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహా రెడ్డి, సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్, వస్పుల సాయిలు, రాములు, భీమయ్య, మల్లెపోగు మల్లేష్, జంతుక అల్లాజీ, జహంగీర్, జంగయ్య, పవన్, రేవల్లి రాజు, కలీం, అఫ్రోజ్, సురేష్ నాయక్, రఫీ, శంకర్, యాదయ్య, భరత్ తదితరులు ఉన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తితోనే 'ప్రజాపాలన'


**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాసంక్షేమం ఎజెండాగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేష్ అధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఆవిర్భవించడంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన కృషి ఎంతో ఉందన్నారు. సమాజంలో అన్నివర్గాల ప్రజలకు న్యాయం అందించాలనే విధంగా రాజ్యాంగ కల్పన చేసిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. యువత మహనీయులు చూపిన బాటలో నడుస్తూ ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.



కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, ఎంపీడీవో మాధురి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మండల అధ్యక్షులు తెల్గమల్ల జగన్, బిచ్యా నాయక్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, నాయకులు గుర్రం కేశవులు, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ ఖాదర్, అవ్వారి శివలింగం, కాలే మల్లయ్య, అబ్దుల్ అలీమ్, గాజుల శ్రీనివాస్, మెకానిక్ బాబా, ఎంగలి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, కండె సాయి, సురేష్ నాయక్, దేవరశెట్టి మహేష్, కుమార్ గౌడ్, పులికంటి మైసయ్య, జగదీష్, శ్రీను నాయక్, రాజేందర్, రహీం, విజయ్ నాయక్, ఫిరోజ్, కొండల్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెండో విడత గొర్రెల పంపకం తక్షణమే అమలు చేయాలి




**యాచారం, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రెండో విడత గొర్రెల పంపకం తక్షణమే అమలు చేయాలని యువజన యాదవ సంఘం అధ్యక్షుడు బైకనీ శివకుమార్ యాదవ్ డిమాండ్ చేశారు.గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నగదు రూపంలో పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదని ఆయన విమర్శించారు. 25 నెలలు గడిచినా యూనిట్లు కానీ, నగదు కానీ ఇవ్వలేదని, ప్రజా పాలన పేరుతో కమిషన్లకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు.ప్రజలకు వాస్తవ ప్రయోజనం లేకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్న ఈ ప్రభుత్వానికి రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

## జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ మృతి

**ఆమనగల్లు, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** చంచల్ గూడ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ బాణావత్ రాందాస్ మృతి చెందాడు. ఆమనగల్లు మండలం సీతారాంనగర్ తండాకు చెందిన రాందాస్ గత మార్చి 31న భార్య కవిత (28), కుమారుడు హర్షిత ను హత్య చేశాడు. ఈ కేసులో అరెస్టై జైలుకు తరలించబడ్డాడు. జైలులో ఉండగా ఒక్కసారిగా కిందపడిపోయాడు. ఈ



ఘటనలో గాయాలు కావడంతో ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మరణించారు. ఈ విషయాన్ని సీఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు.


ఇబ్రహీంపట్నంలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి


డిండి మండలం ఎర్రారం గ్రామంలో

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నిరసన

**కరీంనగర్, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కరీంనగర్‌లోని ప్రధాన విద్యుత్ కార్యాలయం ముందు ఉద్యోగులు



నిరసన కార్యక్రమం నిర్వహించారు. పీఆర్సీ, బకాయి వేతనాలు, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ, తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ నిరసనలో విద్యుత్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు.

# అంబలితో వేడి నుంచి ఉపశమనం’

- సీఐ గంగాధర్
- లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**ఆమనగల్లు, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అంబలి తాగితే వేడి నుంచి ఉపశమనం కలుగుతుందని సీఐ గంగాధర్ తెలిపారు. కడ్తాల్ పట్టణ కేంద్రంలో గత 14 రోజులుగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో ఉచిత రాగిజావ పంపిణీ కార్యక్రమానికి మంగళవారం సీఐ గంగాధర్ హాజరై పంపిణీ చేశారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందడానికి అంబలి, రాగి జావ పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్, వస్విక్ ఫౌండేషన్ సభ్యులను సీఐ అభినందించారు. అంబలితో ఆరోగ్యం బాగుంటుందని, గ్రామీణ ప్రాంతాల ప్రజలు లయన్స్ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్, క్లబ్ సభ్యులు బీసీ సంఘం నాయకులు పిప్పళ్ళ వెంకటేష్, దోనాదుల మహేష్, పిఆర్ఓ లయన్ పాషా, లియో తరుణ్, ధర్మేందర్, రాజు నాయక్, కృష్ణ నరేష్ గౌడ్, రాంజీ నాయక్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి సహాయం



**ఆమనగల్లు, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మండలం శంకర్ కొండ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని దయ్యాలబోడు తండాకు చెందిన వినోద్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. తండాకు చెందిన వార్డు సభ్యులు నేనావత్ నవీన్, రాజు నాయక్ మృతుడు వినోద్ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం 50 కేజీల బియ్యం కిరాణా సామాగ్రి అందజేశారు. వారి వెంట తండా నాయకులు టాక్యా, దేవసింగ్, రమేష్, పాండు, శ్రీను, రవి, లాలూ, ఉమేష్ తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా పాపిశెట్టి రాము



**ఆమనగల్, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శంకర్ కొండ తండా పరిధిలోని దయ్యాల బోర్డు తండాలో వద్యావత్ వినోద్ మరణంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము అంతిమయాత్రలో పాల్గొని బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనుశా శ్రీశైలం, నాయకులు శ్రీను నాయక్, దేవా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో--బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు



**మర్రిగూడ, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని నాంపల్లి ప్రధాన రహదారిపై బట్లపల్లి వద్ద ఆటో--బైక్ ఢీకొని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉండడంతో పోలీసులు యరగండ్లపల్లి సర్పంచ్ సొంత అంబులెన్స్‌లో మాల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనపై సమాచారం సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

# రహదారి భద్రత.. అందరి బాధ్యత

- ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు





**ఆమనగల్లు, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రహదారి నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేస్తూ రోడ్డు ప్రమాదాలను నివారిద్దామని ఆమనగల్లు ఎస్. హెచ్.ఓ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ కుసుమ మాధురి అధ్యక్షతన జరిగిన అరైవ్-అలైవ్ కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. రాష్ట్రంలో ఏటా 5 లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని.. అందులో 1.50 లక్షల మంది మృతి చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదల కంటే రోడ్డు ప్రమాదాలే అధికమని.. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు రోడ్డు భద్రత వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్స్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం ప్రధాన లక్ష్యమన్నారు. యువత ప్రమాదాలకు గురికాకుండా రహదారి నిబంధనలు పాటించేలా కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వంటి చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారి తీస్తాయని, అలాంటి ఘటనలు కుటుంబాలకు తీరని నష్టాన్ని కలిగిస్తాయని వివరించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్, నాలుగు చక్రాల చోదకులు సీట్ బెల్ట్ ధరించాలని, మితిమీరిన వేగం పనికిరాదని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంటబెట్టుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రమాదాల నివారణకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ సీతారాం రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, దుడ్డు ఆంజనేయులు యాదవ్, ఎనుమల్ల రమేష్, నాగిళ్ళ జగన్, అనిత శ్రీనివాస్ రెడ్డి, అనూష శ్రీశైలం, మొక్తల వెంకటయ్య, మార్కెట్ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య నాయకులు కృష్ణ నాయక్, గుర్రం కేశవులు, వస్పుల సాయిలు, సయ్యద్ ఖలీల్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఒగ్గు మహేష్, కొమ్ము ప్రసాద్, నరేందర్, కాలే మల్లయ్య, వస్పుల శ్రీకాంత్, సురేష్ నాయక్, గాజుల శ్రీను, శ్రీను నాయక్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**కరీంనగర్/హుస్నాబాద్ /పాలకుర్తి/మానకొండూర్, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా జిల్లాలో, రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా వేడుకలు జరిగాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా, రేకుర్తి, మున్సిపల్ కేంద్రం, సంఘ భవనాలు, విద్యాసంస్థలు, బార్ అసోసియేషన్ కార్యాలయాలు, శాతవాహన యూనివర్సిటీ వద్ద అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బిఆర్ఎస్, కాంగ్రెస్, కార్మిక సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, న్యాయవాదులు, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జై భీమ్ నినాదాలతో వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పునూటి శ్రీనివాస్ కార్మిక హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్ రావు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అంబేద్కర్ చూపిన సమానత్వం, సామాజిక న్యాయం బాటలో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడి, ఉల్లంపల్లి, ఓగులాపూర్, ఇందుర్తి గ్రామాల్లో ప్రజలు, మహిళలు, యువకులు అంబేద్కర్ ఆశయాలను స్మరించారు. పాలకుర్తి మండలంలోని గ్రామాల్లో జెండా ఆవిష్కరణ, విగ్రహాలకు పూలమాలలు సమర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, శాతవాహన యూనివర్సిటీ కార్యదర్శి అనిల్ విద్యార్థులు అంబేద్కర్ ఆలోచనలు తమకు మార్గదర్శకమని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కూడా నివాళులు అర్పించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ మహిళల రిజర్వేషన్ల కోసం, అంటరానితన నిర్మూలన కోసం చేసిన కృషిని గుర్తుచేశారు. న్యాయవాదులు ఊరేగింపులో పాల్గొన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నమనేని తిరుపతిరావు రేకుర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యాంగ ఫలాలు ప్రతి పౌరుడికి అందాలని, సామాజిక సమరసత సాధించడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ పాషా, రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్ గౌడ్, పోలాస రామచంద్రం, నాగమ్మోహన్, శంషాద్దీన్, శ్రీధర్ రావు, చోటా మియా, దామెర మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ లోని లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా నిజమైన నివాళి అర్పించవచ్చని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు, సంఘాలు, నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని ప్రతిజ్ఞ చేశారు.

# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**ఉప్పునుంతల/పెద్దపల్లి/మహేశ్వరం/బాలాపూర్, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా జిల్లాలో, పట్టణాల్లో, గ్రామాల్లో ఘనంగా వేడుకలు జరిగాయి. ఉప్పునుంతల మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక సర్పంచి చింతకాయల శ్రీనివాసులు, ఎస్సై వెంకటరెడ్డి, గ్రామ ప్రజలు, వివిధ పార్టీ నాయకులు పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దపల్లి బస్టాండ్ సమీపంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీ కృష్ణ, ప్రభుత్వ విప్ విజయరమణరావు, ఎమ్మెల్యే మక్కన్ సింఘ్ రాజ్ ఠాకూర్, మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి, రాష్ట్ర ఎస్సీ/ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మినారాయణ, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎం. రవీందర్, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, విద్యార్థి నాయకులు, సంఘ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ గ్రామం 62వ వార్డులో మాల సంఘం ప్రధాన కార్యదర్శి గుండ రాఘవేంద్ర బాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో గుండె నాగార్జున బాబు, కొప్పుల వినయ్ కుమార్, దార్చ పవన్ కుమార్, గుండె గణేష్ బాబు, సత్యనారాయణ, నాలిక ప్రకాష్, నాలిక శివకుమార్, ఎం.సి. శేఖర్, మర్రి శివకుమార్, గుండె హరీష్ బాబు, మర్రి శేఖర్, మర్రి ప్రేమ్ కుమార్, హరికాంత్, యువకులు నవదీప్ కుమార్, గుండె తనుష్ బాబు, మర్రి చందు, మూల ప్రదీప్, దార్చ యశ్వంత్, గుండె విగ్నేష్ బాబు, కొప్పుల పియుష్, కొప్పుల సాహర్ష పాల్గొన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు అందెల శ్రీరాములు యాదవ్, కొలన్ శంకర్ రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వెంకటేష్, జోరాల ప్రభాకర్, చిగురింత పారిజాత నరసింహారెడ్డి, ఎల్మేటి అమరేందర్ రెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, వంగటి మధుసూదన్ రెడ్డి, వంగటి లక్ష్మారెడ్డి, దోసాడ శ్రీనివాస్ రెడ్డి, కోటగిరి మురళీకృష్ణ, జూకంటి సురేష్ గౌడ్, రితిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిహెచ్ఎంసి 60వ డివిజన్ శ్రీ సాయి కృపా నగర్ కాలనీలో మేకల యాదగిరి, బందెల ప్రదీప్ కుమార్, బోజు కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ కార్పొరేటర్ ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్ పాల్గొని పారిశుద్ధ్య సిబ్బంది, ఎలక్ట్రీషన్స్, వాటర్ మెన్, చెత్త సేకరణ సిబ్బందిని శాలువాలతో సన్మానించి నగదు కానుకలు అందజేశారు. మాజీ కార్పొరేటర్ దోమలపల్లి రాజ్ కుమార్, అబ్బనమోని గోపి యాదవ్, ప్రేమ్ కుమార్, బల్వంత్ రెడ్డి, ఆకుల హరీష్, సుందర్ రాజు, సహదేవ్, జక్కుల గోపాల్ యాదవ్, రూప్ కరణ్, బక్కతట్ల కృష్ణ యాదవ్ పాల్గొన్నారు. ప్రశాంతి హిల్స్ డివిజన్ 58 బాలాపూర్ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించిన వేడుకల్లో మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్న లక్ష్మారెడ్డి, టీపీసిసి ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్ రెడ్డి, తెలంగాణ మహిళ ఉపాధ్యక్షురాలు సుగుణరెడ్డి, సామిడి చరణ్ రెడ్డి, కామోజీ తిరుపతయ్య, ధరవత్ స్వామినాయక్, మాదరి శ్రీనివాస్, సార్ల రవి, వరికుప్పల శివ, డేరింగుల వంశీ, లోకేష్, మైత్రి ఆనంద్, నర్సింగరావు, మదు, సత్తయ్య, ప్రశాంత్, కొంగర నర్సింహా తదితరులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. బాలాపూర్, బడంగ్ పేట్ డివిజన్లలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి పాల్గొని అంబేద్కర్ ఆలోచనలు సమాజానికి మార్గదర్శకమని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, బాలింగని జంగయ్య, గట్టు బాలకృష్ణ, బొల్లపల్లి కుమార్, సూర్ణగంటి విజయ్, గొరిగే శ్రీశైలం, నిరుడు శ్రీరాములు, కొప్పుల రాజు, పగడాల ఉమేష్, గిరికటి కృష్ణంరాజు గౌడ్, టేకుల సుధాకర్ రెడ్డి, సంరెడ్డి మహిపాల్ రెడ్డి, పెద్దబావి బాబు, ఇక్కే శ్రీను, నయన చారి, మనోహర్, గిరి ముదిరాజ్, అనురాధ, అమృత నాయుడు, అరుణ జ్యోతి, మహిళలు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు, నాయకులు, సంఘాలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని ప్రతిజ్ఞ చేశారు.

# ఘనంగా 135వ అంబేద్కర్ జయంతి వేడుకలు

**కరీంనగర్/హుస్నాబాద్ /గన్నేరువరం/తిమ్మాపూర్, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా జిల్లాలో, మండలాల్లో, గ్రామాల్లో ఘనంగా వేడుకలు జరిగాయి. కరీంనగర్ రూరల్ 6వ డివిజన్ బొమ్మకల్‌లో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మిడిదొడ్డి కపిల్ మాధవ, నగర కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, కార్పొరేటర్ మ్యాకల వెంకటేష్, గాదె రూప, శ్రీనివాస్, ఇస్తియాక్ అహ్మద్, రూరల్ మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్లు గంటా శ్రీనివాస్, పడిశెట్టి భూమయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు రజితా రెడ్డి, బీరం ఆంజనేయులు, బూస సాయికృష్ణ, కొండా పోచయ్య, గోష్కి శంకర్, సముద్రాల అజయ్, గాలిపెల్లి శ్రీనివాస్, గోష్కి నర్సయ్య, దొమ్మటి మల్లేశం, చంద్రయ్య, మల్లయ్య, బొట్ల అనిల్, గాలిపెల్లి కుమార్ రాజు, ప్రశాంత్, అనిల్ తదితరులు పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం, హరితహారం, సహపంక్తి భోజనం నిర్వహించారు. గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామంలో సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ జరిగింది. ఈ సందర్భంగా ఆయన విద్య, ఐక్యత, క్రమశిక్షణ ద్వారానే సామాజిక సమానత్వం సాధ్యమని, అంబేద్కర్ చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామచంద్రం,



గోవింద, సంతు, సంపతి, కోమల రమేష్, సంపతి మల్లీశ్వరి, కత్తి శ్రీను, మాడుగుల కరుణాకర్ రెడ్డి, దమ్మగల శేఖర్, కన్నం ప్రవీణ్ కుమార్, రమేష్ పాల్, జోషి నరేష్, సురేష్, శేఖర్, సుంకరి రమేష్, గంగాధర, మహేందర్, సుధాకర్, బండి తిరుపతి, గంగాధర, ఆంజనేయులు, మాజీ సర్పంచ్ కుమ్మరి సంపత్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండలంలో బీజేపీ అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ మహాత్మ నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, బొంతల కళ్యాణ్ చంద్ర, బుర్ర శ్రీనివాస్ గౌడ్, కానుగంటి మధుకర్ రెడ్డి, వేల్పుల ఓదెలు, రామిడి మహేందర్ రెడ్డి, పిట్టల మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు. రామకృష్ణ కాలనీలో చింతం శ్రీనివాస్‌ను స్థానిక నేతలు శాలువాతో సన్మానించారు. మాజీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వర చారి, కోతి రాజు, రేగూరి సుగుణాకర్, సిద్ధ చిరంజీవి, గుజ్జుల రాజిరెడ్డి, దుర్గంటి శేఖర్ రెడ్డి, ఎడ్ల భూంరెడ్డి, వేల్పుల ఓదయ్య, సోన్నాకుల తాపాల్ శ్రీనివాస్, రాజు, తాళ్లపెల్లి మల్లయ్య, శాబోలు గణేష్, అలువాల లింగమూర్తి, భూతం దేవ్ బాలాజీ, తుర్పాటి శ్రీనివాస్, పోలవేణి ఓదెలు, బోళ్ల శంకర్, గంగు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్ కోహెడ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయన బడుగు బలహీన వర్గాల కోసం అంబేద్కర్ చేసిన పోరాటాన్ని స్మరించారు. ఈ కార్యక్రమంలో బందెల బాలకిషన్, బోయిని నిర్మల, జయరాజు, బందెల సుజాత, కృష్ణయ్య, అభిలాష్, నవీన్ కుమార్, పొన్నాల లక్ష్మయ్య, మంద ధర్మయ్య, వేల్పుల శ్రీనివాస్, పెరుగు నరేందర్ రెడ్డి, ఖమ్మం వెంకటేశం, కర్ణాకంటి మంజుల రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపిటీసీలు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ జయంతి వేడుకలు ఉత్సాహంగా జరిగి, ప్రజలు, నాయకులు, సంఘాలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని ప్రతిజ్ఞ చేశారు.

## రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలు



**కరీంనగర్, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణంలోని ఐబి గెస్ట్ హౌస్ నుండి ఆర్టీసీ వర్క్‌షాప్ వరకు పట్టణ సుందరీకరణలో భాగంగా నాటిన చెట్లు భారీగా పెరిగి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ స్థాయికి కొమ్మలు వ్యాపించాయి. వాహనదారులు చెబుతున్న ప్రకారం, ఈ పరిస్థితి కొనసాగితే గాలి దుమారాలు, వడగాల్పుల సమయంలో చెట్ల కొమ్మలు విరిగి రహదారిపై పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారుల భద్రత కోసం సంబంధిత మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని చెట్ల కొమ్మలను తొలగించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు చెబుతున్నట్లు, ప్రమాదం జరిగాక కాకుండా ముందే చర్యలు తీసుకోవడం అవసరమని, పరిశుభ్రతతో పాటు భద్రతను కూడా కాపాడాలని కోరుతున్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన దర్శనాల రాకేష్ మానేరు వాగు నుండి ఇసుకను దొంగలించి జూబ్లీ నగర్ వద్ద తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అలాగే మానకొండూరు మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ముత్యం అజయ్ తన యజమాని వెల్ది గ్రామానికి చెందిన నగునూరి అనిల్ ఆదేశాల మేరకు అక్రమంగా ఇసుకను రవాణా చేస్తుండగా బొమ్మకల్ డివిజన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.




## ఘనంగా ఆరైవ్--అలైవ్ పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఆరైవ్--అలైవ్ కార్యక్రమ పోస్టర్‌ను కరీంనగర్‌లో ఘనంగా ఆవిష్కరించారు. సీపీ గౌస్ ఆలం, కలెక్టర్ చిత్ర మిశ్రా, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, ఇతర ఉన్నతాధికారులు వేదికపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ జిల్లాలో 96 గ్రామాల్లో రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్లక్ష్యంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, రక్షణాత్మక డ్రైవింగ్‌పై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. తలకు తగిలిన గాయాల వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని కాపాడిన వారికి పీఎం రహవీర్ సింగ్ పథకం కింద బహుమతి అందజేస్తారని, దాని గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజలు రోడ్ సేఫ్టీ ప్రతిజ్ఞ చేశారు.

## అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఉద్రిక్తత

**కరీంనగర్, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా కరీంనగర్ కోర్టు చౌరస్తా వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అంబేద్కర్ విగ్రహానికి నివాళు లర్పించేందుకు ఏబీవీపీ నాయకులు తమ సంఘం జెండాలతో చేరుకోగా, పోలీసులు వారిని అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. జెండాలతో నివాళు లర్పించడానికి అనుమతించకపోవడం వివాదానికి దారితీసింది. ఈ సందర్భంగా ఏబీవీపీ శ్రేణులు పోలీసుల పక్షపాత వైఖరిని, ప్రభుత్వ ఒత్తిడిని ఆరోపించారు. సీపీ గౌస్ ఆలం సమక్షంలోనే విద్యార్థి నాయకులపై పోలీసులు దౌర్జన్యానికి దిగడం సిగ్గుచేటని ఏబీవీపీ నాయకులు మండిపడ్డారు. విద్యార్థులపై దాడి చేసిన పోలీసు అధికారులపై వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పోలీసుల నిరోధంతో కోర్టు చౌరస్తా వద్ద తోపులాట జరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అంబేద్కర్ సాక్షిగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే వారిపై దాడి చేయడం అప్రజాస్వామికమని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## వాసవి మాత జయంతి ముందస్తు వేడుకలు

**కరీంనగర్, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ పట్టణంలోని అశోక్ నగర్‌లో వాసవి మాత జయంతి (ఏప్రిల్ 26)ను పురస్కరించుకొని వాసవి ఇంటర్నేషనల్, వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ముందస్తు వేడుకలు నిర్వహించారు. క్లబ్ సెక్రటరీ బొడ్ల రమాదేవి గృహంలో వాసవి మాత పారాయణం నిర్వహించగా, క్లబ్ జోన్ చైర్మన్ యంసాని భారతి, అధ్యక్షురాలు కాచం సమత, ట్రెజరర్ అర్చన, క్లబ్ సభ్యులు, స్థానిక ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పండ్లు, ప్రసాదం పంపిణీ చేయడం జరిగింది. వాసవి మాత జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.




## జెండా గద్దె వద్ద చెత్త సమస్యపై ప్రజల ఆందోళన

**కరీంనగర్, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణంలోని తిలక్ నగర్ చౌరస్తా (విశ్వకర్మ వీధి)లో జెండా గద్దె దగ్గర చెత్తాచెదారం పేరుకుపోవడంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు చెత్తను తక్షణమే తొలగించి పరిశుభ్రతను కాపాడాలని, మున్సిపల్ సిబ్బంది ద్వారా శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. జెండా గద్దె చుట్టూ కవచంలా కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని డివిజన్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక కార్పొరేటర్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.



## గన్నేరువరంలో వ్యక్తి అదృశ్యం

### - గాలింపు చర్యలు ముమ్మరం

**గన్నేరువరం, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జంగపల్లి గ్రామానికి చెందిన ఖాత లక్ష్మయ్య (వయసు 50, తండ్రి పేరు నరసయ్య) ఏప్రిల్ 8న ఇంట్లో గొడవ పెట్టుకుని ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ కనపడకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. భార్య ఖాత పద్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా, గన్నేరువరం ఎస్ఐ నరేందర్ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. లక్ష్మయ్య ఇంట్లో జరిగిన చిన్నపాటి గొడవ తర్వాత ఆవేశంతో బయటకు వెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అతను ఎక్కడికి వెళ్లాడో, ఎవరితో ఉన్నాడో ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లభించలేదు. గ్రామస్తులు కూడా అతని కోసం గాలింపు చర్యల్లో భాగస్వామ్యం అవుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, సమీప గ్రామాలు, బంధువుల ఇళ్లలో, బస్ స్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు వంటి ప్రదేశాల్లో గాలింపు చర్యలు చేపడుతున్నారు. అతని ఫోటో, వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లకు పంపి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు లక్ష్మయ్య సురక్షితంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నారు. పోలీసులు అతని ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, త్వరలోనే అతన్ని కనుగొంటామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో గ్రామంలో ఆందోళన వాతావరణం నెలకొంది. ప్రజలు మిస్సింగ్ కేసు త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.



## అంతంపేటలో 135వ అంబేద్కర్ జయంతి వేడుకలు

**గన్నేరువరం, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంతంపేట గ్రామపంచాయతీలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఘనంగా వేడుకలు జరిగాయి. గ్రామ సర్పంచ్ వెంకటయ్య యాదవ్, ఉప సర్పంచ్ హరికృష్ణ మహారాజ్, గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షుడు మహేష్ యాదవ్ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రాజు, సాయికిరణ్, లక్ష్మణ్, బన్నీ, సైదులు, రమేష్, నవీన్, రాజేష్, నితిన్ మరియు ఇతరులు హాజరై అంబేద్కర్ ఆశయాలను స్మరించారు. ప్రజలు సమానత్వం, న్యాయం, విద్య ప్రాముఖ్యతపై అంబేద్కర్ చూపిన మార్గాన్ని అనుసరించాలని ప్రతిజ్ఞ చేశారు.




## గంగాధరలో మహిళా ఆత్మహత్యాయత్నం

**గంగాధర, ఏప్రిల్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలంలోని వెదిరా ఎక్స్‌రోడ్ వద్ద విషాదకర ఘటన చోటుచేసుకుంది. కరీంనగర్‌కు చెందిన కాసిన గొట్టి భారతి అనే మహిళ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సమాచారం అందుకున్న వెంటనే రామడుగు ఎస్సై రాజు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన భారతిని వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గ్రామ ప్రజలు ఈ సంఘటనతో దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మహిళ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

